తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

శనివారం 29-7-2023

కూకట్‌పల్లిలో భారీ అగ్నిప్రమాదం

కూకట్‌పల్లి, జూలై 29 (తెలుగుప్రభ)

కూకట్‌పల్లిలోని ఓ సర్వీసింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. హైదర్‌నగర్‌లోని జెమ్ మోటార్స్ సర్వీసింగ్ సెంటర్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెయింటింగ్ కోసం ఉపయోగించే కంప్రెషర్ ఒక్కసారిగా పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో మంటలు సర్వీసింగ్ సెంటర్ మొత్తానికి వ్యాపించడంతో దట్టమైన పొగలు చుట్టుపక్కల ప్రాంతాలను కమ్మేశాయి . దీంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సిబ్బంది, స్థానికులను పోలీసులు ఆరా తీస్తున్నారు. కంప్రెషర్ పేలడంతోనే మంటలు చెలరేగినట్లు చెబుతున్నారు. ఈ అగ్నిప్రమాదంతో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఒకేసారి కాటేసిన రెండు పాములు

మూడేళ్ల బాలుడి మృతి

నిజామాబాద్, జూలై 29 (తెలుగుప్రభ)

భారీ వర్షాలకు వచ్చిన రెండు పాములు మూడేళ్ల బాలుడిని బలితీసుకున్నాయి. దీంతో ఆ కుటుంబంలో తీవ్రమైన విషాదం ఏర్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన మంగళి భూమయ్య, హర్షిత దంపతులకు రుద్రాన్ష్(3), కుమార్తె(3 నెలలు) ఉన్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భూమయ్య ఇంట్లోని ఓ గది కూలిపోయింది. దీంతో పక్కనే ఉన్న మరో గదిలో పిల్లలతో కలిసి శుక్రవారం రాత్రి నిద్రించారు. ఈ క్రమంలో రెండు పాములు వచ్చి రుద్రాన్ష్‌ను కాటేశాయి. బాలుడు ఆ నొప్పి భరించలేక గట్టిగా ఏడ్వడంతో.. భూమయ్య మేల్కొన్నాడు. బాలుడిని కాటేసి వెళ్తున్న రెండు పాములను భూమయ్య గమనించాడు. ఆ రెండు పాములను కర్రలతో కొట్టిచంపాడు. అనంతరం బాలుడిని జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం కన్నుమూశాడు. రుద్రాన్ష్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కాంగ్రెస్ కీలక నేత కుమారుడి అరెస్ట్

నల్గొండ, జూలై 29 (తెలుగుప్రభ)

భార్య మృతి కేసులో..

భార్యను హత్యచేసి సహజమరణంగా చిత్రీకరించాడనే ఆరోపణలతో నల్గొండ జిల్లాకు చెందిన ఓ రాజకీయ నాయకుడు కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. హత్య, సాక్ష్యాలు చెరిపేసినట్లుగా నిర్ధారించి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిపై కేసులు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత యడపల్లి రంగసాయిరెడ్డికి వల్లభ్‌రెడ్డి ఒక్కడే కొడుకు. వల్లభ్‌కు గతేడాది హైకోర్టు ఉద్యోగి కోతి జైపాల్‌రెడ్డి కుమార్తె లహరితో వివాహం జరిగింది. దంపతులిద్దరూ హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో నివాసముంటున్నారు. కాగా, ఈ నెల 14న లహరికి హార్ట్ ఎటాక్ వచ్చిందంటూ వల్లభ్ ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. హాస్పిటల్ నుంచే ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. ఆ వెంటనే జైపాల్ రెడ్డి దంపతులు ఆ ఆస్పత్రికి వెళ్లారు. కాసేపటికే లహరి చనిపోయింది. అనుమానస్పదమృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకున్నారు. ఇటీవల వచ్చిన పోస్టుమార్టం నివేదికలో లహరి శరీరంలో అంతర్గత గాయాలైనట్లు తేలింది. ఈ నివేదిక ఆధారంగా పోలీసులు ఈ నెల 26 వల్లభ్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. అతడిపై 201, 302 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు.

ఊహించని ట్విస్టులు

ఈ కేసులో ఊహించని ట్విస్టులు చోటు చేసుకున్నాయి. లహరి అంత్యక్రియలను నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో నిర్వహించగా.. ఈ నెల 24న దశదినకర్మను జరిపించారు. ఈ కార్యక్రమాలకు ఆమె తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. ఈ నెల 26 తెల్లవారుజామున వల్లభ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తమ అల్లుడు చాలా మంచివాడని లహరి తల్లిదండ్రులు చెబుతున్నారు. తమ అల్లుడిని జైలుకు పంపించటం వెనుక రాజకీయ కుట్రదాగి ఉందని అంటున్నారు. పెళ్లి నాటి నుంచి దంపతుల మధ్య ఎలాంటి మనస్పర్ధలు లేవని అంటున్నారు. చాలా అన్యోన్యంగా ఉండేవారని వరకట్న వేధింపులు కూడా లేవని చెప్పారు. తమ కూతురు శరీరంపై గాయాలు ఎలా అయ్యాయో అర్థం కావటం లేదని అన్నారు. ఫోరెన్సిక్ రిపోర్ట్ తర్వాత అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని వెల్లడించారు. రిమాండ్‌లో ఉన్న తన అల్లుడిని పరామర్శించి వచ్చినట్లు లహరి తండ్రి జైపాల్ రెడ్డి చెప్పారు.

రంగసాయిరెడ్డి ఎవరంటే..

రంగసాయిరెడ్డి 1987ను రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన అదే ఏడాది టీడీపీ నుంచి ఎంపీపీగా ఎన్నికయ్యారు. 1989లో జానారెడ్డితో పాటు కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. అనంతరం టీడీపీలో చేరి 1999లో మిర్యాలగూడ ఎంపీగా మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డిపై పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2013లో నిడమనూరు సింగిల్ విండో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.

కాంగ్రెస్‌లో అదే తీరు..

రేవంత్ పర్యటనలో రచ్చ

ఉప్పల్, జూలై 29 (తెలుగుప్రభ)

తెలంగాణలో అధికారం కోసం పాకులాడుతున్న కాంగ్రెస్.. అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతోంది. తాజాగా హైదరాబాద్ ఉప్పల్ కాంగ్రెస్‌లో వర్గవిభేదాలు మరోసారి బయటపడ్డాయి. రేవంత్ పర్యటనలో నేతల మధ్య అంతర్గత కలహాలు చెలరేగాయి. రాగిడి లక్ష్మారెడ్డి పోస్టర్‌ను కార్పొరేటర్ రజిత పరమేశ్వరరెడ్డి వర్గీయులు చించివేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఇరువర్గాలను చెదరగొట్టారు.

వరదల్లో బురద రాజకీయం

విపక్షాలపై మంత్రి పువ్వాడ ఫైర్

ఖమ్మం, జూలై 29 (తెలుగుప్రభ)

భారీ వర్షాలకు ఓ పక్క రాష్ట్రమంతా ఆగమాగమవుతోంది. ప్రభుత్వం సహాయక చర్యల్లో నిమగ్నమైంది. కానీ.. విపక్షాలు మాత్రం ప్రభుత్వాన్ని విమర్శించే పనిలోనే ఉన్నాయని, వరదల్లో బురద రాజకీయం చేస్తున్నాయని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. ఏకధాటిగా కురిసిన వర్షాలతో ఖమ్మం నగరాన్ని మున్నేరు వాగు ముంచెత్తిందని చెప్పారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. మున్నేరు వరద బాధిత కుటుంబాలకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్‌క్యాంపును మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఎంపీ నామా నాగేశ్వర రావుతో కలిసి వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వెయ్యి మందికి నిత్యావసర సరుకులు అందిస్తున్నామని వెల్లడించారు.

కొత్త అంబులెన్స్‌లొస్తున్నాయ్..

ప్రజల ఆరోగ్య, ప్రాణ రక్షణకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 466 కొత్త అంబులెన్స్‌లను అందుబాటులోకి తెలుస్తోంది. అత్యవసర వైద్య సేవల కోసం వీటిని వచ్చే నెల ఒకటో తేదీ నుంచే అందుబాటులోకి తేనుంది. పాత వాహనాలు, కాలం చెల్లిన అంబులెన్స్‌ల స్థానంలో వీటిని తీసుకొస్తున్నారు.

ప్రజారోగ్యంపై తెలంగాణ ఫోకస్..

హైదరాబాద్, జూలై 29 (తెలుగుప్రభ)

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు కొత్త వాహనాలను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేసింది. ఇందులో 108 అంబులెన్సులు 204 ఉండగా.. గర్భిణీలను ఆస్పత్రికి తీసుకురావడంతో పాటు మళ్లీ ఇంటి దగ్గర సురక్షితంగా వదిలిపెట్టడం కోసం 228 అమ్మఒడి వాహనాలను ప్రవేశపెట్టనున్నారు. అలాగే అదనంగా మరో 34 పార్థివ వాహనాలను తీసుకువస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 466 వాహనాలు ఆగస్టు 1 నుంచి ప్రజలకు సేవలు అందించనున్నాయి. పాతవి సరిగ్గా పనిచేయకపోవడంతో అప్పుడప్పుడు రోడ్డు మధ్యలో ఆగిపోతున్నాయి. అలాగే వాటికి రిపేర్ చేయించేందుకు ఎక్కువ ఖర్చు అవుతుంది. అలాగే వాటి నిర్వహణకు కూడా అధిక ఖర్చు అవుతుంది. దీంతో వాటి స్థానాల్లో ఇటీవల కొత్త వాహనాలను వైద్యారోగ్యశాఖ కొనుగోలు చేసింది. ఇటీవల అంబులెన్సు సేవలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి హరీష్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌ల పనితీరుపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 426 అంబులెన్స్‌లు 108 సేవలను అందిస్తున్నాయి. వాటిల్లో 175 వాత వాహనాలను తొలగించనున్నారు. కొత్తగా తీసుకొచ్చే 204 అంబులెన్స్‌లతో కలిపి 108 అంబులెన్సుల సంఖ్య 455కు చేరుకోనుంది. ఇక గర్భిణుల కోసం ప్రత్యేక సేవలందించే 102 వాహనాలు 300 ప్రస్తుతం ఉండగా.. వాటిల్లో కలం చెల్లిన 228 వాహనాలను తొలగించనున్నారు. ఇప్పుడు కొత్తగా 228 వాహనాలను తీసుకొస్తున్నారు. ఇక ప్రభుత్వ హాస్పిటల్స్‌లలో మృతి చెందినవారి పార్థివ దేహాలను తరలించేందుకు ఉపయోగిస్తున్న హర్ సే వాహనాలు ప్రస్తుతం 50 అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 34 వాహనాలకు తొలగించి.. వాటి స్థానాల్లో కొత్తవి రీ ప్లేస్ చేస్తున్నారు.



ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ హ్యాక్ చేసి..

అడ్డదారిలో బీటెక్ విద్యార్థి..

కటకటాల పాలు

న్యూఢిల్లీ, జూలై 29 (తెలుగుప్రభ)

తక్కువ ధరకే ఎక్కువ దూరం హాయిగా ప్రయాణించే అవకాశం ఉండడంతో చాలా మంది రైలు ప్రయాణానికే మొగ్గుచూపుతారు. అందుకే రైళ్లు ఎప్పుడూ ఫుల్‌గానే ఉంటాయి. రిజర్వేషన్ దొరకడం అంటే గగనమే. దీన్ని గమనించి ఓ బీటెక్ విద్యార్థి తన విజ్ఞానాన్ని అడ్డదారి తొక్కడానికి వినియోగించాడు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి బ్లాక్‌లో తత్కాల్ టిక్కెట్లను విక్రయించడం మొదలుపెట్టాడు. నోయిడాలోని సెక్టార్ 73, సర్ఫాబాద్ కు చెందిన నయన్ ఆలం (22) గ్రేటర్ నోయిడాలోని ఒక ప్రైవేట్ కళాశాలలో చివరి సంవత్సరం బీటెక్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి.. గత రెండేళ్లుగా అక్రమంగా టిక్కెట్లు విక్రయిస్తూ డబ్బులు దోచుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే టికెట్ల అక్రమ దందా గురించి జూలై 26 న ప్రయాగ్‌రాజ్ సైబర్ క్రైమ్ విభాగం ఆర్‌పీఎఫ్ దాద్రీని హెచ్చరించింది. నోయిడాకు అనుసంధానంగా ఉన్న అనుమానాస్పద ఐపీ చిరునామా, మొబైల్ నంబర్‌ను ఉపయోగించి ఒకే రోజులో అనేక తత్కాల్ టిక్కెట్లు బుక్ అవుతున్నాయని పోలీసులకు తెలిపింది. సైబర్ వింగ్ నుంచి అందిన సమాచారం ఆధారంగా, తాము సాంకేతిక విశ్లేషణ సహాయంతో నిందితుడిని ట్రాక్ చేసి అరెస్టు చేసామని దాద్రి రైల్వే స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌కె వర్మ తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి

కలెక్టర్లతో కేటీఆర్ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, జూలై 29 (తెలుగుప్రభ)

శనివారం మధ్యాహ్నం వరకూ ఎండ ఉన్నప్పటికీ.. మూడు గంటల సమయంలో చిరుజల్లులు పడ్డాయి. తెలంగాణలో వర్షాలు తగ్గుముఖం పట్టే సూచనలు ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కలెక్టర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. వారితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. సహాయసహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అన్ని శాఖలతో మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిండిన చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలకు ప్రతి జిల్లాలో కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా పారిశుధ్య డ్రైవ్‌ని చేపట్టాలన్నారు. ప్రజలు మంచినీరు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు.



గోదా'వర్రీ'

రెండో ప్రమాద హెచ్చరిక జారీ

అమరావతి, జూలై 29 (తెలుగుప్రభ)

ఎడతెరిపి లేని వర్షాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్ట్ వద్ద గోదావరి ప్రస్తుత నీటిమట్టం 14.70 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇన్ ఫ్లో 14 లక్షల 42 వేల క్యూసెక్కులు ఉండగా రెండవ ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం కొనసాగుతోంది. ఇప్పటికే చింతూరు విలీన మండలాల్లో 120 గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కాగా బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. లాంచీల సహాయంతో అధికారులు ముంపు గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నారు. వరద ముప్పు ఎక్కువగా ఉన్న కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.